న్యూస్‌రీల్

ఆర్జీయూకేటీలో క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్



ఆర్జీయూకేటీ డైరెక్టర్ కె. బాలాజీ

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఈ నెల 21 నుంచి 27 వ తేదీవరకూ క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ -2025 నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిశోధన అంశాలకు సంబంధించి వినియోగిస్తున్న క్వాంటమ్ టెక్నాలజీపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించాలని ఐబీఎం క్వాంటమ్ సంస్థ నిర్ణయించిందని తెలిపారు. దీని కోసం కొన్ని విద్యాసంస్థలను ఎంపిక చేసి అక్కడ సదస్సులు నిర్వహించనున్నారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు నేరుగా నాలుగు వేల మంది విద్యార్థులు, ఆన్‌లైన్‌లో మరో ఆరువేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు అమరావతి క్వాంటమ్ వ్యాలీ సలహాదారు, ఐబీఎం క్వాంటమ్ ఇండియన్ లీడర్ ఎల్. వెంకటసుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించనున్నారని, తర్వాత 3 రోజులు పాటు దేశ, విదేశాల నుంచి వచ్చే నిపుణులు అవగాహన కల్పించనున్నారని చెప్పారు. రెండు రోజులు పాటు హ్యాకథాన్ నిర్వహించి, చివరి రోజు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. క్యాంపస్‌లో సీఎస్‌ఈ విద్యార్థులు దూదేకుల ఖాశివంలి, కాటం నిఖిల్‌తేజ, చెరుకూరి ప్రవీణ్‌కుమార్, తృతీయ సంవత్సరం చదువుతున్న చదువుల జాన్‌బాబు, ద్వితీయ సంవత్సరం విద్యార్థి కిమిడి గుణశ్రీలు రెండేళ్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీపై అధ్యయనం చేస్తూ పలు సదస్సులకు హాజరయ్యారని చెప్పారు. క్వాంటమ్ టెక్నాలజీకి వీరు ఆలోచనలు పంపగా ఐబీఎం సంస్థ గుర్తించి ఈ సదస్సు నిర్వహణకు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌ను ఎంపిక చేసిందని డైరెక్టర్ తెలిపారు.

24న పాతపట్నంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో డాక్టర్ రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా మోటార్స్‌తో సహా మొత్తం 11 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని తెలిపారు. కాకుళం, విశాఖపట్నం, శ్రీసిటీ (నెల్లూరు), హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో సుమారు 500 ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఫొటోలు, ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మేళా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8317652552 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భయపెట్టాలనుకోవడం ప్రభుత్వ అవివేకం



'సాక్షి' పత్రిక ఎడిటర్‌పై కేసులు పెట్టి భయపెట్టాలని అనుకోవడం ప్రభుత్వ అవివేకం. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలు మానుకోవాలి.

– బొడ్డేపల్లి రమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి



స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు



నిజాలు నిక్కచ్చిగా ప్రజలకు తెలియజేస్తున్నారన్న అక్కసుతో 'సాక్షి'ని వేధించడం సరికాదు. ప్రజాస్వామ్యంలో విపక్షం, మీడియా చేసే నిర్మాణాత్మక విమర్శలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. స్వేచ్ఛకు సంకెళ్లు వేయకూడదు. – అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ కళింగవైశ్యకుల అధ్యక్షుడు

కేసులు పెట్టడం దారుణం



వార్తలు రాసే విలేకరుల పైన, ప్రచురించే ఎడిటర్ల పైన కేసులు పెట్టడం దారుణం. వెంటనే ఇలాంటి వేధింపులను ఆపాలి. పెట్టిన కేసులు ఎత్తివేయాలి.

– టీవీ మోహన్‌చంద్రదేవ్, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు

అజాగ్రత్తే చీకటి.. అవగాహనే వెలుగు

- జిల్లావ్యాప్తంగా 100 దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు
- దీపావళికి జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచన

శ్రీకాకుళం క్రైమ్ :

ప్రశాంత వాతావరణంలో, ప్రమాదాలకు తావివ్వకుండా జిల్లా ప్రజలు దీపావళి పండగ జరుపుకోవాలని, తక్కువ కాలుష్యం ఉన్న గ్రీన్ క్రాకర్స్ మాత్రమే వినియోగించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఇళ్లలో, దుకాణాల్లో లైసెన్సు లేకుండా బాణసంచా నిల్వలు ఉంటే దాడులు నిర్వహించి కేసులు పెడతామన్నారు. బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్సు చేసినా, వాహనాలు నడిపినా, పేకాట నిర్వహించినా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. జిల్లాలో వంద దుకాణాలకు బాణసంచా సామగ్రి విక్రయించేందుకు తాత్కాలిక అనుమతి ఇచ్చారు. పర్మినెంట్ షాపులు 12 ఉన్నాయి.



హద్దులు దాటితే అనర్థమే..



- టపాసుల్లో టాక్సిక్ కారకాలైన రాగి, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడియం, పొటాషియం, గంధకం వంటివి ఉండటంతో శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా భూచక్రాలు, పాము మాత్రలు, మతాబులు, చిచ్చుబుడ్లు వల్ల అధికంగా పొగ వ్యాపిస్తుంది.
- టపాసులు పేల్చినప్పుడు వెలువడే ధ్వని అపరిమితంగా ఉంటుంది. బాణసంచా కాల్చేటప్పుడు 125 నుంచి 130 డెసిబుల్స్ శబ్దం వెలువడుతుంది. సాధారణ మనిషి వినికిడి శక్తి 50 డెసిబుల్స్ మాత్ర మే. అంతకు మించి శబ్దాలను వింటే వినికిడి సమస్యల బారినపడ్తారు.

అనర్థాలే అధికం..

భారీ శబ్దాలు, రసాయనాలు వెలువరించే బాణసంచా స్థానంలో మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలిగించాలి. గాలి, శబ్ద కాలుష్యం నివారించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. టపాసుల తయారీలో కాపర్, కాడ్మియం, లెడ్, అమ్మోనియం, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, సోడియం, మెర్క్యురీ, లిథియం, పొటాషియం వంటి అనేక మిశ్రమాలతో తయారు చేస్తారు. వీటి నుంచి వచ్చే వెలుగులతో కన్ను, ఘాటు వాసనతో ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయి.

ప్రమాదాలు సంభవిస్తే..

- టపాసులు కాల్చినప్పుడు అగ్నిప్రమాదం సంభవిస్తే తక్షణమే దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రాలకు లేదా 101 నంబర్‌కు డయల్ చేసి సమాచారమివ్వాలి. 100, 108 నంబర్లనూ సంప్రదించాలి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు								
	శ్రీకాకుళం	08942222099	ఇచ్ఛాపురం	08947231101	సోంపేట	08947234101	పలాస	08945241101
	రణస్థలం	08942234499	నరసన్నపేట	08942 276777	ఆమదాలవలస	08942286401	కొత్తూరు	08946258444
	టెక్కలి	08945244277	కోటబొమ్మాళి	08942238659	పొందూరు	08941242101	మందస	08947237101

పరమ పవిత్రం.. కార్తీకం

- 22 నుంచి కార్తీక మాసం ఆరంభం
- ముస్తాబవుతున్న దేవాలయాలు



హిరమండలం: పరమ పవిత్రమైన కార్తీక మాసం రానే వస్తోంది. ఈ నెల రోజులూ దైవ భక్తిలో ఉంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మాసంలో దీపారాధనకు అనేక శుభ ఫలితాలు కలుగుతాయని నమ్ముతారు. దీపాన్ని దైవ స్వరూపంగా భావించి పూజలు చేస్తారు. కార్తీక సోమవారాల్లో చేసే దీపారాధన, ఉసిరి చెట్టు కింద పూజలు, వన భోజనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పండితులు చెబుతున్నారు. అక్టోబర్ 22 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసంలో నాలుగు వారాలు ఈ పూజలు కొనసాగుతాయి.

దీపారాధన ప్రత్యేకత

కార్తీక మాసంలో ఒక్కో రకమైన ప్రమిదలో దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని నమ్ముతారు. మట్టి ప్రమిదలో వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుందని, పింగాణి ప్రమిదలో దీపం వెలిగిస్తే ఆ ఇంటి వారికి అలంకరణ వస్తువులు సమకూరుతాయని, ఇత్తడి ప్రమిదలో దీపాలు వెలిగిస్తే ఆ ఇంట్లో దైవశక్తి అధికవవుతుందని, కంచు ప్రమిదలో వెలిగిస్తే ఆయుష్సు పెరుగుతుందని పెద్దలు చెబుతుంటారు. నిమ్మ ప్రమిదల్లో వెలిగిస్తే అన్ని కార్యాల్లోని విజయం సిద్ధిస్తుందని, అరటి దోనెలో దీపం వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధన రక్షణ కలుగుతుందని, ఉసిరికాయల దీపం వెలిగిస్తే పాపాలు తొలగిపోతాయని కూడా చాలా మంది విశ్వసిస్తారు.

శివకేశవులకు సమప్రాధాన్యం

కార్తీకమాసం శివుడికి, విష్ణువుకి ప్రీతికరమైంది. అందుకే ఈ మాసం ప్రతి సోమవారం శివుడికి, ప్రతి శుక్ర, శని వారాల్లో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు.

శివపార్వతుల పుత్రుడైన అయ్యప్ప దీక్షలు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణువుకి తులసీ దళార్చన ఈ మాసంలోనే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. లక్ష్మీదేవి, కార్తికేయుడు, చంద్రుడు, ఇంద్రుడు, తులసిమాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది.



హిరమండలంలో ముస్తాబైన ఉమారుద్రకోటేశ్వరాలయం

సంపూర్ణ ఆరోగ్యం



కార్తీక మాసం చాలా పవిత్రమైన మాసం. ఈ నెల రోజుల పాటు దీపారాధన చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. దీపారాధన ద్వారా ప్రశాంతత చేకూరుతుంది. – పి.లావణ్య, యంబరాం

మానసిక ప్రశాంతత



నెలరోజుల పాటు ఆలయాల్లో దీపారాధన చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. కుటుంబంలో సుఖశాంతులు లభిస్తాయి.

– కె.రోజా, కోవిలాం, ఎల్ఎన్‌పేట

ఆ ఊళ్లే దీపావళి

గార, టెక్కలి: జిల్లాలో దీపావళి పేరిట రెండు గ్రామాలు ఉన్నాయి. గార మండలంలోని ఓ గ్రామం ఉంటే.. టెక్కలి మండలంలో మరో గ్రామం ఉంది. గార మండలంలోని దీపావళి గ్రామానికి ఆ పేరు రావడానికి ఓ కథ ప్రచారంలో ఉంది. దాని ప్రకారం.. ఓ కళింగ రాజు ఇటుగా వస్తూ ఈ గ్రామానికి దీపావళి అనే పేరు పెట్టారు. అప్పటి వరకు ఈ ప్రాంతాన్ని గూడెం అని పిలిచేవారట. ఆ రాజు ప్రతి రోజూ శ్రీకాకుళం నుంచి శ్రీకూర్మం వరకు గుర్రంపై వెళ్లేవారట. మార్గం మధ్యలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద ఆగి స్వామిని దర్శించుకునేవారు. ఒక రోజు శ్రీకూర్మం వెళ్లి వస్తూ ఇక్కడ సొమ్మసిల్లి పడిపోయారు. ఇక్కడి వారు ఆయనకు సాయం చేయగా కోలుకున్నారు. ఊరి వారిని గ్రామం పేరు అడగ్గా పేరేమీ లేదని చెప్పారు. ఆ రోజు దీపావళి కావడంతో ఆ ఊరికి దీపావళి అనే పేరును పెట్టారు. రెవెన్యూ రికార్డుల్లోనూ ఈ పేరే ఉంది. టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీ పరిధిలో 'దీపావళి' గ్రామం ఒకటి. టెక్కలి నుంచి బన్నువాడ గ్రామం మీదుగా సుమారు 7 కిలోమీటర్ల దూరంలో మారుమూల ప్రాంతంలో ఈ దీపావళి గ్రామం ఉంది. పండగ పేరుతో ఉన్న ఈ గ్రామంలో మొత్తం 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దీపావళి పేరుతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.



దీపావళి పేరుతో ఉన్న నేమ్‌బోర్డు



టెక్కలి మండలంలోని దీపావళి గ్రామం

కొనకుండానే పేలుతున్నాయ్!



కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నరసన్నపేట, శ్రీకాకుళం కల్చరల్: తగ్గిన జీఎస్టీలతో బాణసంచా ధరలు తగ్గుతాయని భావించిన వారికి మందుగుండు ధర దడ పుట్టిస్తోంది. ధరలు గత ఏడాది కంటే ఎక్కువ ఉండడం గమనార్హం. జిల్లాలో శనివారం నుంచి విక్రయాలు ప్రారంభించారు. శాశ్వత దుకాణాల్లో ముందు నుంచే విక్రయాలు ఉన్నా తాత్కాలిక లైసెన్సులు పొందిన దుకాణాల వద్దనే ఎక్కువ మంది కనిపిస్తున్నారు. అధికంగా సేల్ అయ్యే అగ్గిపెట్టెలు, తారా జువ్వలు, మతాబులు, క్రాకర్లు, భూచక్రాలు, చిచ్చుబుడ్డీలు, థౌజెండ్ వాలా వంటి సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయి. గత ఏడాది కంటే 20 శాతం వరకూ ధరలు అధికంగా ఉన్నాయని వినియోగదారులు అంటున్నారు.

గత ఏడాది కంటే అధికమే

దీపావళి టపాసులు కొనుగోలు చేశాను. గత ఏడాదితో పోల్చితే ధరలు అధికంగానే ఉన్నాయి. ధరలు తగ్గుతాయని అనుకుంటే పెరుగుదల కనిపించింది.

– శర్మ, స్టేట్‌బ్యాంకు వీధి నరసన్నపేట

ధరలు ఎక్కువే

ఏటా టపాసులు కొంటున్నాను. ఈ సారీ కొన్నా. ధరలు అధికంగానే ఉన్నాయి. జీఎస్టీతో బాణసంచా ధరలు తగ్గుతాయని అన్నారు. ఆ ప్రభావం ఏమీ కనిపించలేదు.

– లబ్బ రాజేష్, కోమర్తి

నేడు గ్రీవెన్స్‌సెల్ రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దీపావళి కారణంగా సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మార్కెల్ల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్పీ గ్రీవెన్స్‌సెల్ కూడా రద్దు చేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా నరక చతుర్దశి



అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఉద్యావన మండపంలో ఆదివారం సాయంత్రం నరకచతుర్దశి ఘనంగా జరిగింది. దీపావళి పండగ సందర్భంగా ముందుగా ఉషాపద్మిని ఛాయా సమేతంగా సూర్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను తిరువీధిగా తీసుకువచ్చి ఉద్యాన మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నరకాసురుడి ప్రతిరూపాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

–అరసవల్లి

క్లుప్తంగా

మందుగుండు సామగ్రి సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

పొందూరు: పొందూరులో ఎటువంటి లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని సామగ్రి సీజ్ చేసినట్లు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మార్కెట్ వీధిలో దీపావళి సామాన్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా రూ.1,09,623 విలువైన మందుగుండు గుర్తించామన్నారు. పొట్నూరు వెంకటరావు వద్ద రూ.40,088, జామి మణికంఠ వద్ద రూ.59,717, గుడ్ల రవి వద్ద రూ. 9,818 విలువైన సామగ్రి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

'నాభూమి..నాదేశం' స్మారక శిలాఫలకం కూల్చివేత



విక్రంపురం వద్ద నాభూమి నాదేశం స్మారక శిలాఫలకాన్ని కూల్చివేసి చదును చేసిన దృశ్యం



గత ప్రభుత్వంలో చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన శిలాఫలకం(ఫైల్)

టెక్కలి: గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా టెక్కలి మండలం విక్రంపురం వద్ద ఎర్ర చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన 'నాభూమి నాదేశం' స్మారక శిలా ఫలకాన్ని కూల్చివేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగానికి గుర్తుగా.. భావి తరాలకు పుడమితల్లి విలువను తెలియజేసే విధంగా.. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు గుర్తుగా ప్రతి పంచాయతీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వీటిని నిర్మించారు. దీనిలో భాగంగా టెక్కలి మండలం బొప్పాయిపురం పంచాయతీ విక్రంపుర వద్ద స్మారక శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దానిని కూల్చివేసి ఒక వైపు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని.. మరో వైపు స్వాతంత్ర్య సమరయోధులు, వీరుల త్యాగాన్ని నేలమట్టం చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంచిలి: బూరగాంలో జాతీయ రహదారి పక్కన ఇటీవల మతిస్థిమితం లేని వ్యక్తి ఫిట్స్‌వచ్చి పడి ఉండగా శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉండవచ్చని, గోధుమ రంగు టీ షర్టు, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిస్తే కంచిలి పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రాష్ట్రంలో నిర్బంధ పాలన

- గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పథకాల వర్తింపు
- వైఎస్సార్ సీపీపై అక్కసుతో మంచి పథకాలను సైతం ఆపేస్తున్నారు
- సాగునీటి ప్రాజెక్టులకు ఏళ్లు గడిచినా మోక్షం కలగడం లేదు
- చల్ల శ్రీను సన్మాన సభలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన చల్ల శ్రీనివాసరావును సన్మానిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, పార్టీ నాయకులు, అనుకూల మీడియాపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన చల్ల శ్రీనివాసరావు అభినందన సభ శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించామన్నారు. పేదవాడు అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే ఆయుధమని నమ్మిన వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిలు తమ పాలనలో అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. అటువంటి ఇంగ్లిష్ మీడియం విద్యపై కక్ష గట్టి చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు.

రాజకీయాలంటే డబ్బు సంపాదన కాదు..

కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా పేదవాడికి వైద్యం అందకుండా చేయడం సరికాదని ధర్మాన అన్నారు. ఎంతోమంది జీవితకాలం సంపాదించుకున్న డబ్బులు ఒక్క అనారోగ్యంతో మొత్తం కోల్పోతున్నారని చెప్పారు. రాజకీయాల్లో పదవులు చేపట్టడం అంటే డబ్బులు సంపాదించుకోవచ్చన్న అపోహ చాలా మందిలో ఉందని, అలాకాకుండా సమాజానికి సేవ చేసే అదృష్టంగా భావించాలన్నారు. రాజకీయ పార్టీ కోసం కష్టపడి పనిచేసి న్యాయం చేయగలిగితేనే పదవులకు సార్థకత చేసినట్టవుతుందన్నారు. పార్టీలో కష్టాలు, గుర్తింపు ఉంటాయని, అన్నింటినీ ఒకేలా స్వీకరిస్తేనే రాజకీయాల్లో రాణించగలమన్నారు. ప్రతిపక్షంలో వచ్చే అవకాశాలు ఒక్కొక్కరికి ఒక్కో సమయంలో పదవులొస్తాయని వాటిని సక్రమంగా వాడుకుని నాయకుడిగా ఎదిగేందుకు అవకాశాల్ని అందిపుచ్చుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. పరిపాలన ప్రజల వద్దకు తీసుకొచ్చేందుకు రెండు వేలు మంది జనాభా ఉన్న ప్రతిగ్రామంలో సచివాలయాలు నిర్మించి అనేక సేవలు అందించగలిగామన్నారు. చంద్రబాబు 40 ఏళ్లలో చేయలేనివి జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసి చూపించారన్నారు.

అన్యాయాలను ప్రశ్నిస్తే కేసులా?

అధికార పార్టీ నాయకులు ఎంతోమంది అర్హులకు పథకాలు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టే పరిస్థితి ప్రతి గ్రామంలో ఉందని, వైఎస్సార్‌సీపీ హయాంలో అవేమి లేకుండా పాలన సాగిందని ధర్మాన అన్నారు. ఏ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు చిట్టానే కనిపిస్తుందని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఎంతకాలమూ సాగవన్నారు. బీదలకు అనుకూలంగా అనేక యాక్ట్‌లపై చంద్రబాబు దుష్ప్రచారం చేసి వాటిని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. అధికార పార్టీ నేతలు చేసే అరాచకాలు, అన్యాయాలు ప్రశ్నించడమే నిజమైన ప్రతిపక్షమన్నారు. విజిలెన్స్, ఏసీబీ వంటి అవినీతి నిర్మూలన శాఖల్ని వాడుకుని అవినీతిలేని సమాజాన్ని తయారుచేసేందుకు ప్రతిపక్ష నాయకులు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలన అధ్వానంగా ఉండబట్టే ప్రజల్లో అతివేగంగా బలహీనపడిందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు గొండు నర్సింగరావు, తంగి సత్యనారాయణ, అంధవరపు తవిటయ్య, పసగాడ సూర్యనారాయణ, గుండ అప్పలసూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవితో పాటు తాను అవినీతిరహిత పాలన అందించాం కాబట్టే ప్రజల్లో మంచి గుర్తింపు పొందగలిగామన్నారు. ప్రజలు నాయకుల వద్ద నుంచి డబ్బులు ఆశిస్తే ప్రభుత్వ ఫలాలు సక్రమంగా తీసుకోలేరన్నారు. అధికార పార్టీ నాయకులు అధికంగా డబ్బు ఖర్చుపెట్టి గెలిచాక ఆ డబ్బులు ఎలా వసూలు చేయాలనే తాపత్రయంతో పాలన చేస్తారే తప్ప నీతివంతంగా చేయలేరన్నారు. పేదల కోసం చంద్రబాబు ఏనాడైనా ఎకరం భూమి అయినా సేకరించి పంచిపెట్టగలిగారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ హయాంలో నగరంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణం పూర్తిచేసి ఇచ్చామన్నారు. శ్రీకాకుళం నగరానికి ఇప్పటికే చాలా చేశానని, చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, ప్రజల ఆశీర్వాదంతో మిగిలిన పనులు పూర్తిచేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సులువుగా సాధించుకోగలమన్నారు. అందరినీ చైతన్యవంతులు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనుల్ని అందరికి తెలియజేయాలని కోరారు. జిల్లాకు ఇప్పటికే తీవ్ర అన్యాయం జరుగుతుందని మౌనంగా ఉంటే పనులు జరగవన్నారు. సౌమ్యుడైన చల్ల శ్రీనును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించడం సంతోషమన్నారు. పార్టీకోసం మరింత కష్టపడి పనిచేసి సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం చల్ల శ్రీనివాసరావుదని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన చల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, న్యాయవాదిగా మంచి గుర్తింపు ఉందని, ఆయన ఆశయాల కోసం పనిచేస్తానన్నారు. సమాజంలో గౌరవంగా బతకాలన్నదే తన లక్ష్యమని, తనకు అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వర్తిస్తానన్నారు. తనకు పదవిని అప్పగించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు, కళింగ వైశ్య, పోలినాటి వెలమ కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురాం, ముంజేటి కృష్ణ, పొన్నాడ రుషి, శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, మండవల్లి రవి, చిట్టి జనార్ధనరావు, టి.కామేశ్వరి, అంబటి నిర్మల, కోణార్క్ శ్రీనివాసరావు, తంగుడు నాగేశ్వరరావు, వైశ్యరాజు మోహనరావు, మూకళ్ళ తాతబాబు, యజ్జల గురుమూర్తి, డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, డాక్టర్ అమ్మన్నాయుడు, చల్ల రవి, బొడ్డేపల్లి పద్మజ, గంగు శారద తదితరులు పాల్గొన్నారు.

డీఏ ప్రకటన కంటితుడుపు చర్య



బుక్కూరు ఉమామహేశ్వరరావు



పేడాడ కష్ణారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల ముందు అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉద్యోగులకు అనేక అమలు చేయలేని హామీలిచ్చిన చంద్రబాబునాయుడు 16 నెలల తరువాత ఒక్క డీఏ మాత్రమే ప్రకటించడం భావ్యం కాదని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కూరు ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. ఉద్యోగులకు ఆశ కల్పించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ముఖం చాటేయడం సిగ్గుచేటన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ కాకుండా ఒక్క డీఏ ఇవ్వడం దారుణమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రులు సొంత పనులకోసం కోట్లాది రూపాయిలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న కూటమి సర్కారుకు పెన్షనర్లు, ఉద్యోగుల సంక్షేమం పట్టడం లేదని దుయ్యబట్టారు. ఇదే వైఖరి కొనసాగిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

శ్రీకాకుళం: రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు కంటితుడుపు చర్యగా రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏ మాత్రమే ప్రకటించడం సరికాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పేడాడ కృష్ణారావు, పూజారి హరిప్రసన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగులకు కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నా వాటిని చెల్లించకుండా బకాయిపడిన నాలుగు డీఏలలో కేవలం డీఏ చెల్లించడం ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమన్నారు. మధ్యంతర భృతి ప్రకటన చేయకుండా, మూడేళ్లుగా ఉద్యోగుల సంపాదిత సెలవుల డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఒకవైపు చెబుతూనే, మరోవైపు విశాఖపట్నంలో ప్రతిపాదిత గూగుల్ డేటా సెంటర్‌కు సంవత్సరానికి 22 వేల కోట్ల రూపాయలు రాయితీని ప్రకటించడం దేనికి నిదర్శనమో ముఖ్యమంత్రి సమాధానం చెప్పకుండా, ఉద్యోగ వర్గాలను నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు.

బస్సు ఆపలేదని నిరసన



ఆర్టీసీ బస్సును అడ్డుకున్న మహిళలు

పోలాకి : బస్సు ఆపడం లేదంటూ బెలమర జంక్షన్ సమీపంలో జీడిపప్పు ఫ్యాక్టరీ వద్ద మహిళలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 సమయంలో గుప్పెడుపేట-నరసన్నపేట ఆర్టీసీ బస్సు ఫ్యాక్టరీ వద్ద ఆగడంతో మహిళా కార్మికులు ఎక్కేవారు. ఉచిత బస్సు పథకం వచ్చిన తర్వాత డ్రైవర్ బస్సు ఆపడంలేదు. ఇదేంటని మహిళలు ప్రశ్నిస్తే అక్కడ స్టాప్‌లేదని, ముందున్న స్టాప్ దగ్గరకు రావాలని దురుసుగా సమాధానం చెప్పడంతో మహిళలు ఆగ్రహించి బస్సును రోడ్డుమీదే ఆపేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంజిత్ డ్రైవర్, మహిళలతో మాట్లాడారు. రిక్వెస్ట్ స్టాప్‌గా పరిగణించాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. దాదాపు 20 మంది మహిళలు నిత్యం బస్సుకోసం వేచి ఉన్నచోట కాదని, ఇంకోచోట స్టాప్ ఉందని తప్పించుకుంటే ఊరుకునేది లేదని మహిళలు స్పష్టం చేశారు. టికెట్ తీసుకున్నపుడు ఉన్న స్టాప్, ఉచితం అన్నప్పుడు ఎందుకుండదని నిలదీయటం గమనార్హం.

వృద్ధుడు ఆత్మహత్య

రణస్థలం: లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన గురజాపు అప్పలనాయుడు (69) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు ఈ నెల 10న సాయంత్రం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. భార్య మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు హెచ్‌సీ ఎం.విజయానంద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజు నాడే విషాదం

- మొగదాలపాడు బీచ్‌లో యువకుడు గల్లంతు
- కింతలి ఖాజీపేటలో విషాదఛాయలు



అలబాన జగదీష్ కుమార్ (ఫైల్)



యువకుడి స్నేహితులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార/పొందూరు: పుట్టిన రోజు వేడుకల కోసం స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వచ్చిన యువకుడు గల్లంతైన ఘటన మొగదాలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం కింతలి ఖాజీపేట గ్రామానికి చెందిన అలబాన జగదీష్‌కుమార్ విశాఖపట్నంలోని ఐటీఐ చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన జగదీష్‌కు ఆదివారం పుట్టిన రోజు కావడంతో మరో నలుగురి స్నేహితులతో కలిసి గార మండలం వత్సవలస పంచాయతీ మొగదాలపాడు వచ్చారు. సాయంత్రం బీచ్‌లో స్నానానికి దిగిన ఐదుగురు కేరింతల్లో ఉండగా భారీ అలకు జగదీష్ గల్లంతయ్యాడు. వెంటనే గాలించినా జాడ దొరకలేదు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఘటనా స్థలానికి వెళ్లి సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. జగదీష్ స్నేహితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జగదీష్ తండ్రి గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు, గాలింపు చర్యలు చేపట్టామని ఏఎస్ఐ తెలుగు చంద్రశేఖర్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన బోర జోగమ్మ(73) ఆదివారం ఉదయం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. జోగమ్మకు చిన్నకోడలు సరస్వతితో శనివారం చిన్నపాటి గొడవ జరిగింది. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు సరస్వతి అత్త జోగమ్మకు టిఫిన్ ఇచ్చి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం 8 గంటలకు అత్త జోగమ్మ ఉంటున్న ఇంటికి స్నానానికి వేడి నీళ్లు పట్టుకుని వెళ్లి చూసేసరికి జోగమ్మ తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని కనిపించిందని మృతురాలి చెల్లెలు ఆబోతు తులసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, జోగమ్మకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్యామలరావు మస్కట్‌లో, చిన్న కుమారుడు భాస్కరరావు దుబాయ్‌లో వెల్డింగ్ పనిచేస్తున్నారు. పెద్దకుమారుడి కుటుంబం విశాఖపట్నంలో ఉండగా, చిన్నకుమారుడి కుటుంబం కర్తలిలో ఉంటున్నారు. జోగమ్మ ఇరు కుటుంబాల వద్ద చెరో మూడు నెలలు ఉంటోంది. 50 రోజుల క్రితం జోగమ్మ కర్తలి గ్రామానికి వచ్చింది. ఇంతలో విషాదం చోటుచేసుకుంది.

హోటల్ రంగంతో ఉపాధి అవకాశాలు



హోటల్స్ అసోషియేషన్ జిల్లా, టౌన్ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): హోటల్ రంగం ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో జిల్లా హోటల్స్, రెస్టారెంట్స్, బేకర్స్, ఫంక్షన్ హాల్స్ అసోసియేషన్, టౌన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మెట్ట నాగరాజు నాయకత్వంలో ప్రధాన కార్యదర్శిగా కెల్ల కిశోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా అంధవరపు సతీష్, కోశాధికారిగా అంధవరపు తిరుమలరావు ప్రమాణస్వీకారం చేశారు.

టౌన్ అధ్యక్షుడిగా అరవల సతీష్, జనరల్ సెక్రటరీగా తుంబలి సుదర్శన్ పట్నాయక్, కోశాధికారిగా టంకాల కృష్ణ, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా ఏ.సతీష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా సెంట్రల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వి.ఆనంద్, ఎస్.వి.డి మురళీ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన



బెండిగేటు వద్ద గోతుల్లో చేరిన నీటితో వాహనచోదకుల ఇక్కట్లు

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణ మార్పుల ప్రభావంతో వజ్రపుకొత్తూరు మండలంలో రెండు రోజులుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. కాశీబుగ్గ కేటీ రోడ్డు, బెండిగేటు-పూండి కూడలి, అక్కుపల్లి-కాశీబుగ్గ రోడ్లు జలమయమయ్యాయి. ఆయా రహదారుల్లో ఏర్పడిన గోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

త్యాగాలకు సలామ్

- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- జిల్లాలో అమరులైన ఐదుగురు పోలీసులు
- స్మారకోత్సవాలకు సన్నద్ధమైన పోలీసు అధికారులు



పోలీసు అమరవీరుల స్థూపం

శ్రీకాకుళం క్రైమ్: లక్షలాది జనాభా పాల్గొనే సమావేశాలు.. ఇసుకేస్తే రాలనంత రద్దీగా ఉన్న దేవాలయాలు.. మండుతున్న ఎండల్లో భోజనం లేకపోయినా బందోబస్తు కాయాల్సిందే. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో విధులంటే కత్తిమీద సామే. అలా నక్సలైట్ల దాడుల్లో అశువులు బాసిన పోలీసులు ఎందరో అమరులయ్యారు. ప్రతీ ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వారిని స్మరిస్తూ జిల్లాలో ఈ నెల 21 నుంచి 31 వరకు స్మారకోత్సవాలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు.

స్మారకోత్సవం ఎందుకంటే..

1959 అక్టోబరు 21న దేశ సరిహద్దులో చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం దీటుగా ఎదురొడ్డి పోరాడింది. జవాన్లు పది మంది ప్రాణాలను కోల్పోవడమే కాక ఎంతోమంది పోలీసులు సైతం వివిధ ఘటనల్లో ప్రాణాలు సైతం కోల్పోయారు. వీరి సేవలకు గుర్తుగా ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరులు సంస్మరణ దినాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. జిల్లాలో పలువురు అమరులైన పోలీసులను, వారి త్యాగాలను స్మరించుకుందాం.

కొండ దగ్గర కాపుకాసి..



విజయనగరం జిల్లా డెంకాడ మండలం గునపురం పేట గ్రామానికి చెందిన ఎస్.బంగారునాయుడు శ్రీకాకుళం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. 1992 మార్చి 24న కాశీబుగ్గ ఎస్‌హెచ్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో మందస మండలం భేతాళపురంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో స్పెషల్ బ్రాంచి ఎస్ఐ జగన్మోహనరావు, ఏడుగురు రిజర్వ్ సిబ్బందితో కలిసి రైడ్‌కు వెళ్లారు. ఇద్దరు నిందితులను పట్టుకుని వస్తున్న సమయంలో రట్టికొండ దగ్గర కొండచాటు నుంచి నాగావళి దళం కాల్పులు జరిపారు. ఎదురు కాల్పులు జరిగినా.. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో వీరోచితంగా పోరాడి అదే రోజున బంగారునాయుడు వీర మరణం పొందారు.

సమాచార సేకరణలో దిట్ట ..



టెక్కలి గ్రామానికి చెందిన ఎం.నరేంద్రదాస్ 1976లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. మావోయిస్టుల సమాచార సేకరణలో దిట్టగా పేరుగాంచారు. వారి ఉద్యమాలను నీరుగార్చేందుకు విశేష కృషి చేశారు. మావోయిస్టుల కదలికలను గమనించి వారి ఆకృత్యాలను నిరోధించడంలో నరేంద్రదాస్ సఫలమవుతుండటాన్ని వారు సహించలేకపోయారు. 1997 మార్చి 17న కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సమయంలో దారిలో దైవ దర్శనానికి ఆగి ఉన్న సమయం చూసి మావోయిస్టులు కాల్పులు జరపగా దాస్ వీరమరణం పొందారు.

స్మారకోత్సవాలు ఇవే..

అక్టోబర్ 21న జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ ఆధ్వర్యంలో సంస్మరణ దినం. మావోయిస్టులు, ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులతో పోరాటం, ప్రాణాలు అర్పించిన పోలీసులను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారు. ప్రతి పీఎస్ పరిధిలో ముఖ్య కూడళ్లు, ప్రదేశాల్లో అమరవీరుల ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేస్తారు. 22 నుంచి 31 తేదీల్లో ఎచ్చెర్లలోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీసుల ఆయుధాలు, పరికరాలు సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ నిర్వహించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహనపరుస్తారు. పోలీసు అమరవీరుల గ్రామాలను సందర్శించి వారి కుటుంబసభ్యులను పరామర్శించి త్యాగాలను స్మరిస్తూ జ్ఞాపికలు ఇస్తారు. 24 నుంచి 27 మధ్య రోజుల్లో అన్ని సబ్ డివిజన్ల పరిధిలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తారు. 31న జిల్లాకేంద్రంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహిస్తారు.

పీపుల్స్ గ్రూప్ చేతిలో బలి..



ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సంతకవిటి మండలం వాల్టేరు గ్రామానికి పి.కృష్ణమూర్తి 1988లో పోలీస్ కానిస్టేబుల్‌గా చేరారు. మావోయిస్టుల కార్యకలాపాల సమాచార సేకరణలో కీలకంగా వ్యవహరించడంతో ఇతన్ని మట్టుబెట్టేందుకు నక్సల్స్ పథక రచన చేశారు. మందస పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో 2000 జూన్ 5న పీపుల్ గ్రూప్ నక్సలైట్లు మాటువేసి హరిపురం కూడలికి చేరుకున్న కృష్ణమూర్తి, పీసీ కె.రమేష్‌లపై దాడిచేశారు. ఆ దాడిలో కృష్ణమూర్తి నేలకొరిగారు.

వీరోచితంగా పోరాడి..



కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామానికి చెందిన ఎ.పాపారావు 1971లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో పలాస మండలం నీలిభద్రలో కంబిరిగాం చౌదరి అనేవ్యక్తిని హతమార్చి ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్లు ప్రణాళిక రచించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నలుగురు కానిస్టేబుళ్లతో పికెట్ ఏర్పాటుచేసి హెడ్ కానిస్టేబుల్ పాపారావును ఇన్‌చార్జిగా నియమించారు. 1997 జులై 17న అర్ధరాత్రి మావోయిస్టులు ఆ ఇంటిపై తుపాకుల గుళ్లతో దాడికి ఎగబడ్డారు. చౌదరిని రక్షించే క్రమంలో వీరోచితంగా పోరాడిన పాపారావు వీరమరణం పొందారు.

స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తూ..



పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన మజ్జి వెంకటరమణ 1998లో కానిస్టేబుల్‌గా చేరారు. జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. బత్తిలి పీఎస్ పరిధిలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో అక్కడి ఎస్ఐ, ఆర్ఎస్ఐ వెంకునాయుడు, 27 మంది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి నులకజోడు గ్రామానికి చేరుకున్నారు. 16 మంది మావోయిస్టులు ముందుగా ఐదుచోట్ల పాతిపెట్టిన మందుపాత్రలను పేల్చి పోలీసులపై కాల్పులు జరిపారు. వెంకటరమణ వీరోచితంగా పోరాడి కాల్పుల్లో మరణించారు.

పంచలోహ విగ్రహాలు చోరీ

నరసన్నపేట: స్థానిక సిద్ధాశ్రమంలో 30 ఏళ్లుగా ఉన్న పంచలోహ విగ్రహాలు శనివారం చోరీకి గురయ్యాయని ఆశ్రమ ప్రతినిధి శిమ్మ జగన్నాథం తెలిపారు. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలతో పాటు ఉద్ధరణి, పంచపాత్ర వంటి వెండి వస్తువులు కూడా చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా నరసన్నపేటకు చెందిన పాత నేరస్తుడి పని అని పోలీసులు గుర్తించారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.